


**తొలివెలుగు** జాతీయపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు.

సెల్ : 9491134365



TGTEL/26/A6221

# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయ పత్రిక

TOLE VELUGGU JATIYAPATRIKA



**విలేకరులు కావలెను**

**తొలివెలుగు** జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతుంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9491134365



| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 35 | సోమవారం | 31-ఆగస్టు -2026 | ఎడిటర్ : యంజాల ప్రవీణ్ | పేజీలు: 8 | వెల రూ. 2/- |
|---|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvanagiri | Volume: 01 | Issue:35 | Monday | 31-8-2026 | Editor: Yamjala Praveen | Pages: 8 | Cost: 2/- |


# బిష్కెక్‌లో ప్రధాని మోదీకి ప్రవాస భారతీయుల ఘన స్వాగతం

- ఎస్‌సీఓ సదస్సు కోసం కిర్గిస్థాన్ చేరుకున్న ప్రధాని మోదీ
- బిష్కెక్‌లో ప్రవాస భారతీయుల నుంచి ఘన స్వాగతం
- 'భారత్ మాతా కీ జై' నినాదాలతో హోరెత్తిన పరిసరాలు
- రెండు రోజుల పాటు పలు ద్వైపాక్షిక సమావేశాల్లో పాల్గొననున్న ప్రధాని
- భద్రత, కనెక్టివిటీ, అవకాశాలే లక్ష్యంగా భారత్ ముందుకు







# హైదరాబాద్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం

- గుజరాత్‌లోని మోదీ స్టేడియంను మించిన సామర్థ్యంతో నిర్మాణం
- 100 ఎకరాల భూమిని ఇవ్వనున్న రాష్ట్ర ప్రభుత్వం
- నిర్మాణ, నిర్వహణ ఖర్చులను భరించనున్న బీసీసీఐ
- డిసెంబర్‌లో శంకుస్థాపన చేసేందుకు సన్నాహాలు

హైదరాబాద్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచస్థాయి క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారు. ఆయన ఆదేశాలతో అధికారులు ఇప్పటికే అనువైన స్థలం కోసం అన్వేషణ ప్రారంభించారు. అంతా అనుకున్నట్టు జరిగితే ఈ ఏడాది డిసెంబర్‌లో ఈ భారీ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

- మిగతా 2వ పేజీలో



## వెలిగొండకు కృష్ణమ్మ పరుగులు..

- దశాబ్దాల కలను నెరవేరుస్తున్న సీఎం చంద్రబాబు
- వెలిగొండ ఫేజ్-1 ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- నల్లమల సాగర్‌లోకి 10.7 టీఎంసీల కృష్ణా జలాల విడుదల
- మూడు దశాబ్దాల కరువు ప్రాంత రైతుల కల సాకారం
- సాగు, తాగునీటితో పాటు ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం
- నిర్వాసితులకు వేగంగా పరిహారం అందించిన కూటమి ప్రభుత్వం

2లో

# చిలకలూరిపేట రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సాయం

- సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ
- ఈ నెల 27న ఆటోను ప్రైవేటు బస్సు ఢీకొట్టిన ఘటన
- ఒకే గ్రామానికి చెందిన 8 మంది మృతి చెందిన విషాదం



పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అండగా నిలిచారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ నెల 27వ తేదీన చిలకలూరిపేట సమీపంలో ఈ దురదృష్టకర సంఘటన చోటుచేసుకుంది. విజయవాడ నుంచి తిరుపతి వెళుతున్న ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, ఎదురుగా వస్తున్న ఆటోను

- మిగతా 2వ పేజీలో



2లో

## విజయసాయిరెడ్డిని కేఏ పాల్ తో పోల్చిన బొత్స

- వైసీపీలో సజ్జల నెంబర్ 1, జగన్ నెంబర్ 2 అంటూ విజయసాయి వ్యాఖ్యలు
- ఈ కామెంట్లపై తీవ్రంగా స్పందించిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ
- విజయసాయి రెడ్డిని కేఏ పాల్‌తో పోల్చుతూ ఘాటు విమర్శ
- ఆయన వ్యాఖ్యలతో సమయం వృథా చేసుకోవద్దని పార్టీ శ్రేణులకు సూచన
- విజయసాయి వ్యాఖ్యలతో వైసీపీలో బయటపడిన అంతర్గత విభేదాలు

## రష్యా చమురుక్షేత్రంపై దాడి

- ఎగసిపడిన మంటలు
- ప్రతీకారం తీర్చుకుంటామన్న రష్యా



2లో


## న్యాయవ్యవస్థపై సుప్రీం జడ్జి కీలక వ్యాఖ్యలు

- న్యాయ రంగ నిపుణులను సుప్రీం జడ్జీలుగా ఎందుకు నియమించడం లేదని ప్రశ్నించిన జస్టిస్ భూయాన్
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 124(3)(సి) దీనికి అనుమతిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన
- 76 ఏళ్లుగా కేవలం హైకోర్టు జడ్జీలు, న్యాయవాదులకే అవకాశం దక్కుతోందని వ్యాఖ్య
- ప్రశ్నించడం తిరుగుబాటు కాదంటూ విద్యార్థుల స్వేచ్ఛపై కీలక సూచనలు

రాజ్యాంగంలో స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ, గత 76 ఏళ్లుగా న్యాయశాస్త్రంలో అపారమైన పరిజ్ఞానం కలిగిన ఒక్క విద్యావేత్తను కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించకపోవడం శోచనీయమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అభిప్రాయపడ్డారు. ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ (ఎన్ఎల్‌యూ)

- మిగతా 2వ పేజీలో





2లో

## గ్రేటర్ పోరుకు జనసేన సై..

- తెలంగాణలో విస్తరణపై జనసేన దృష్టి
- గ్రేటర్ హైదరాబాద్ సహా మూడు కార్పొరేషన్ల ఎన్నికల్లో పోటీ
- డిసెంబర్‌లో జరగనున్న ఎన్నికలకు సిద్ధం కావాలని శ్రేణులకు పిలుపు
- ఈ ఎన్నికల ఫలితాలే రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తాయన్న నేతలు
- ఇప్పటికే ఎమ్మెల్సీ అభ్యర్థిని ప్రకటించిన జనసేన

తెలంగాణలో తమ రాజకీయ కార్యకలాపాలను విస్తరించే దిశగా జనసేన పార్టీ కీలక అడుగులు వేస్తోంది. రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ), సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ)



## విద్యార్థుల విద్యాభివృద్ధికి సత్య సాగర మాణిక్యాంబ ట్రస్ట్ అండ

- 22 మంది విద్యార్థులకు రూ.10 వేల చొప్పున స్కాలర్‌షిప్‌ల పంపిణీ
- పాల్గొన్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

**తొలివెలుగు, వనస్థలిపురం :** పేద విద్యార్థుల ఉన్నత చదువులకు సత్య సాగర మాణిక్యాంబ కాపు ఛారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న ఆర్థిక సాయం అభినందనీయమని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కొనియాడారు. వనస్థలిపురంలోని కాపు భవన్‌లో ట్రస్ట్ చైర్మన్ బొలిశెట్టి నరసింహారావు (తాతాలు) ఆధ్వర్యంలో ఆదివారం స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై 22 మంది విద్యార్థులకు (17 మంది కాపు, 5 గురు ఇతర సామాజిక వర్గాలు) ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు బొలిశెట్టి నరసింహారావు చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. గత 18 నెలలుగా 75 మంది వయోవృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు నెలకు రూ.వెయ్యి చొప్పున పింఛను అందించడం, కాపు భవన్ అభివృద్ధికి రూ.12 లక్షలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, సుబ్బారాయన్, ట్రస్ట్ సభ్యులు రామారావు, తోట వెంకటేశ్వర్లు, నాగభూషణం, నారాయణమూర్తి, రుద్ర శ్రీనివాస్, సూరిబాబు, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## బజరంగ్ దళ్ జిల్లా సహసంయోజక్‌గా సట్టు నాని

- యాదాద్రి భువనగిరి జిల్లా బాధ్యతల అప్పగింత
- ధర్మ రక్షణకు నిరంతరం శ్రమిస్తా: నాని



**తొలివెలుగు, రాజపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా బజరంగ్ దళ్ సహసంయోజక్‌గా రాజపేటకు చెందిన సట్టు నానిని నియమించారు. జిల్లా స్థాయి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పలువురు నాయకులు, మిత్రులు ఆయనకు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సట్టు నాని మాట్లాడుతూ.. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, సంస్థ అప్పగించిన బాధ్యతలకు పూర్తి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. యువతను సమాజ సేవా కార్యక్రమాల వైపు నడిపిస్తూ, సంస్థ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. దేశం కోసం, ధర్మ రక్షణ కోసం నిరంతరం శ్రమిస్తూ ముందుకు సాగుతానని పేర్కొన్నారు. తనకు జిల్లా సహసంయోజక్‌గా బాధ్యతలు అప్పగించిన సంస్థ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## 'పీఈటీ' నాగేశ్వర్‌కు రాష్ట్రస్థాయి పతకాలు

- మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో చిన్నగూడూర్ పీఈటీ సత్తా
- మర్రి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా బహుమతుల ప్రదానం






**తొలివెలుగు, చిన్నగూడూర్ :** హైదరాబాదంలోని జింఖానా గ్రౌండ్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు (పీఈటీ) జక్కి నాగేశ్వర్ రెండు పతకాలు సాధించారు. 50 ఏళ్ల వయోవిభాగంలో పాల్గొన్న ఆయన 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించి రజత పతకం, లాంగ్ జంప్‌లో తృతీయ స్థానం సాధించి కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. ఆదివారం నిర్వహించిన బహుమతుల ప్రధానోత్సవంలో మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మర్రి లక్ష్మారెడ్డి, దేవేందర్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన పురస్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ... రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు పతకాలు సాధించడం, చిన్నగూడూర్ పాఠశాలకు పేరు తెచ్చిపెట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రముఖుల చేతుల మీదుగా పురస్కారాలు అందుకోవడం గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు పద్మావతి, సభ్యులు ఖాజామియా తదితరులు పాల్గొన్నారు.



# బోనమెత్తిన పోచంపల్లి.. భక్తి పారవశ్యంలో పట్టణం!

- పలారం బండి ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి
- నల్లపోచమ్మ, మద్దెలమ్మ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు
- పోతరాజుల విన్యాసాలు.. బోనాల ఊరేగింపులో మహిళల సందడి





**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** భక్తి పారవశ్యం.. బోనాల సందడి.. డప్పు చప్పుళ్లు.. పోతరాజుల విన్యాసాలు.. మహిళల బోనాల ఊరేగింపులతో భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రం ఆదివారం సందడిగా మారింది. పట్టణంలో బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పద్మశాలీల ఆరాధ్య దైవమైన మద్దెలమ్మ దేవికి భక్తులు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ దేవి ఆలయంలో ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గౌడ కులస్తుల ఆధ్వర్యంలో బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు రంగురంగుల బోనాలతో ఊరేగింపుగా వెళ్లడంతో పట్టణమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

**ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే అనిల్‌రెడ్డి:**

సాయంత్రం బోనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఉత్సవాల్లో పాల్గొన్నారు. నల్లపోచమ్మ దేవి ఆలయానికి చేరుకున్న ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు పాండురంగం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం మద్దెలమ్మ పలారం బండి ఊరేగింపులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పలారం బండి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. పోతరాజుల నృత్య విన్యాసాలను తిలకించి భక్తులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్నారు.

**తెలంగాణ సంస్కృతిలో బోనాలకు ప్రత్యేక స్థానం:**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. పల్లెలు సుభిక్షంగా, పచ్చగా ఉండాలంటే అమ్మవారి కృపాకటాక్షాలు ఉండాలని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే అతి పెద్ద పండుగల్లో బోనాలు ఒకటని పేర్కొన్నారు. ప్రజలంతా ఐక్యంగా, భక్తిశ్రద్ధలతో సంప్రదాయాలను కొనసాగించడం ఆనందదాయకమన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్‌గౌడ్, బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, సహకార సంఘం అధ్యక్షుడు లవకుమార్, బీసీ జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, పట్టణ అధ్యక్షుడు వంగూరి పాండు, మద్దెలమ్మ దేవి ఆలయ అధ్యక్షుడు సూరపల్లి రాము, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఆడెపు అరవింద్, యువజన సంఘం అధ్యక్షుడు గంజి యుగంధర్, యువజన సంఘం నాయకులు కర్నాటి గణేష్, రుద్ర చంద్రప్రకాష్, గంజి నరేందర్, అంకం సాయి తదితరులు పాల్గొన్నారు.



# రాజపేటలో 'బోనాల' కోలాహలం



- భక్తిశ్రద్ధలతో గౌడ సంఘం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు
- అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించిన మహిళలు
- కోలాటాలు, డప్పు చప్పుళ్లతో మిన్నంటిన సంబరాలు

**తొలివెలుగు, రాజపేట :** రాజపేట మండల కేంద్రంలో ఆదివారం బోనాల సందడి నెలకొంది. గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ, నల్ల పోచమ్మ దేవతలకు బోనాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా సమర్పించారు. మహిళలు తలపై అందంగా అలంకరించిన బోనాలను ఎత్తుకుని డప్పు చప్పుళ్లు, కోలాటాల నడుమ ఊరేగింపుగా బయలుదేరి అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా పోచమ్మ, నల్ల పోచమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపాకటాక్షాలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు వాయిద్యాల హోరు, కోలాటాల సందడి, భక్తుల జైజయధ్వానాలతో రాజపేట ప్రధాన వీధులు మార్మోగాయి. రంగురంగుల వస్త్రధారణలో మహిళలు బోనాలను ఎత్తుకుని ఊరేగింపులో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ బోనాల ఉత్సవాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గౌడ సంఘం సభ్యులు, వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన రాజపేట వాసులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో రాజపేట మండల కేంద్రంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.





# తీరిన లోవోల్టేజి తిప్పలు

- విప్ బీర్ల ఐలయ్య చొరవతో కొండ్రెడ్డి చెరువులో నూతన ట్రాన్స్‌ఫార్మర్
- 25 కేవీ సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు
- ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపిన సర్పంచ్ ఉప్పరి నరేష్

**తొలివెలుగు, రాజాపేట :** మండల పరిధిలోని కొండ్రెడ్డి చెరువు గ్రామ ప్రజలను కొంతకాలంగా వేధిస్తున్న విద్యుత్ లోవోల్టేజి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చొరవతో గ్రామంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గ్రామంలో గత కొంతకాలంగా విద్యుత్ లోవోల్టేజి కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామ సర్పంచ్ ఉప్పరి నరేష్ తెలిపారు. ఈ సమస్యను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి నూతన ట్రాన్స్‌ఫార్మర్ మంజూరుకు చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే చొరవతో గ్రామానికి 25 కేవీ సామర్థ్యం గల సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరై, ఏర్పాటు పనులు పూర్తయ్యాయని తెలిపారు. దీంతో గ్రామంలో విద్యుత్ సరఫరా మెరుగుపడి లోవోల్టేజి సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. గ్రామ ప్రజల సమస్యపై వెంటనే స్పందించి పరిష్కారం చూపిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు గ్రామస్థుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

# కొత్త బోగీలకు నిధులెట్లా?

**కొత్తగా 60 కోచ్‌ల కొనుగోలుకు మెట్రో సంస్థ సన్నాహాలు**

**ఎల్ అండ్ టీ, హెచ్‌ఎంఆర్‌ఎల్ మధ్య కుదరని సయోధ్య**

**నిధులు సర్దుబాటు చేసుకునే అంశాలపై పునరాలోచన**



హైదరాబాద్ మెట్రోలో రోజురోజుకూ పెరుగుతున్న ప్రయాణికుల రద్దీకి తగ్గట్టుగా సేవలందించడంలో రాష్ట్ర ప్రభుత్వం, మెట్రో యాజమాన్యం విఫలమవుతూనే ఉంది. ప్రయాణికుల సంఖ్య 4.6లక్షలకు చేరినా మెట్రో రైళ్లకు అదనంగా రావాల్సిన కొత్త బోగీలను ఏర్పాటు చేయలేకపోయింది. తాజాగా 60 కొత్త బోగీలను సమకూర్చాలని సరార్ నిర్ణయించినప్పటికీ, ఇందుకు కావాల్సిన భారీ నిధులను ఎకడి నుంచి తెస్తారనే దానిపై స్పష్టత కరువైంది. 2017లో ప్రారంభమైన హైదరాబాద్ మెట్రో తొలిదశ (69.2 కిలోమీటర్లు) మూడు కారిడార్లలో ప్రస్తుతం రోజుకు సగటున 4.6 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. 57 రైళ్లు మూడేసి బోగీలతో 1,200 ట్రిప్పులు తిరుగుతున్నా.. ఉదయం, సాయంత్రం వేళల్లో తీవ్ర రద్దీతో ప్రయాణికులు నరకం చూస్తున్నారు.చీవఌంఝుఖుజూవతీం

**రూ.1,200 కోట్ల ఆర్థిక భారం..**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే... తొలుత కొత్త బోగీల రాగాన్ని అందుకున్నది. ఈ హామీ ఇచ్చిన రెండున్నరేళ్లు గడిచినా ఇప్పటికీ మోక్షం కలగలేదు. ఇటీవల నగరవాసుల నుంచి వెల్లువెత్తిన నిరసనల నేపథ్యంలో ప్రతి రైలుకు మరో బోగీని జత చేసి, 4 బోగీల రైళ్లుగా మార్చాలని భావిస్తోంది. ఈ 60 బోగీలకు రూ.1,200 కోట్లు అవసరం కానున్నాయి. అయితే పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో కింద ఈ బోగీలను కొనుగోలు చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వీటికి అయ్యే నిధులను ఎలా సర్దుబాటు చేయాలి?, రూ.1,200 కోట్ల ఆర్థిక భారాన్ని ఎవరు మోస్తారు? అన్నది ప్రధాన చికుముడిగా మారింది.

**కుదరని సయోధ్య...**

ప్రభుత్వానికి, ప్రాజెక్టును నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీ సంస్థకు, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ మధ్య నిధుల వ్యయంపై సయోధ్య కుదరడం లేదు. ఇప్పటికే నష్టాల్లో ఉన్నామని చెబుతున్న ఎల్ అండ్ టీ అదనపు పెట్టుబడులు పెట్టడానికి వెనుకంజ వేస్తున్నది. నిధుల సర్దుబాటుపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వలేకపోతోంది. ప్రత్యేక నిధులు సమకూరుస్తామని అధికారులు చెబుతున్న మాటలు కేవలం ప్రకటనలకే పరిమితమవుతాయా లేక ఆచరణలోకి వస్తాయా అనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది. స్పష్టమైన ఆర్థిక ప్రణాళిక లేకుండా అదనపు బోగీలంటూ చేస్తున్న హడావుడి ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయా? లేక నోటి మాటలకే పరిమితం చేసి ప్రతిపాదనలను కాగితాలకే పరిమితమవుతాయా? అనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు, పీపీపీ విధానంలో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ఏళ్ల తరబడి నెలకొన్న నిర్వహణ లోపాలు, ఆదాయ మార్గాల కొరత ఇప్పటికే మెట్రో భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టాయి. ఒకవైపు అదనపు బోగీల కొనుగోలుకు రూ.1,200 కోట్ల నిధుల సమీకరణ ప్రశ్నార్థకంగా మార్చింది. మరోవైపు టికెట్ ధరలను మరోసారి సవరించి కొత్త బోగీలను ఏర్పాటు చేసుకోవాలని సర్కారు యోచిస్తోంది. ఈ క్రమంలో మెట్రో స్వాధీనం ప్రక్రియను భుజనా వేసుకున్న సర్కార్..ప్రైవేటు సంస్థ ప్రయోజనాలకు మెట్రో ప్రయాణికులకు మెరుగైన రవాణా సదుపాయాలను కల్పించడంలో విఫలం అవుతుంది. చివరకు నిత్యం ఎక్కడో చోట నిలిచిపోయే మెట్రో ప్రయాణానికి కూడా పరిష్కారం చూపించలేని స్థాయికి మెట్రో నిర్వహణ చేరిందనే విమర్శలు వస్తున్నాయి.

# నర్సు దారుణ హత్య

పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన నర్సు కేసులో కొత్త కోణం వెలుగుచూసింది. ఆమెను బీహార్ వాసి హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. బీహార్‌కు చెందిన సైనా ఉల్లా అనే వ్యక్తి కిటికీ నుంచి నర్సు గదిలోకి దూకి ఆమెపై లైంగికదాడికి ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. ఆ సమయంలో బాధితురాలు ప్రతిఘటించగా, నిందితుడు ఆమె గొంతు నొక్కి కేకలు వేయకుండా అడ్డుకోవడంతో నర్సు మృతిచెందినట్లు వారు పేర్కొన్నారు.వార్తాపత్రికలు చదవడం ఘటనకు సంబంధించి పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందిన యువతి ఏడు నెలల కిందట మహేశ్వరంలో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చారు. అక్కడే ఉన్న ఒక ఆసుపత్రిలో నర్సుగా చేరి అదే ఆసుపత్రికి చెందిన గదిలో ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం గదిలోకి వెళ్లి మళ్లీ ఆసుపత్రికి తిరిగి రాకపోవడంతో యాజమాన్యం ఆమెకు ఫోన్ చేసింది. అయినా



స్పందించకపోవడంతో ఆమె ఉంటున్న గదికి సిబ్బందిని పంపి చూడగా, గది తలుపులు లోపలి నుంచి గడియపెట్టి ఉండడంతో కిటికీ సందులో నుంచి చూడగా ఆమె నేలపై పడి ఉంది. ఆసుపత్రి సిబ్బంది తలుపులు విరగ్గొట్టి లోపలకు వెళ్లి చూడగా, ఆమె అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పహాడీషరీఫ్ పోలీసులు సంఘటనాస్థలానికి క్లూస్ టీమ్‌తో చేరుకుని పరిశీలించారు. శరీరంపై గాయాలు గమనించి.. ఆమె మృతిపై అనుమానం ఉందని బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మృతురాలి కుటుంబసభ్యులు పహాడీషరీఫ్ పోలీసు స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. నిందితుడిని కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఘటనా స్థలంలో లభించిన ఆధారాలు, కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుడు పారిపోతున్న సమాచారం వచ్చిన వెంటనే అతడిని పట్టుకుని విచారించగా, సైనా ఉల్లా తాను నేరం చేసినట్లు ఒప్పుకున్నాడు. సైనా ఉల్లా ఒక రియల్‌ఎస్టేట్ సంస్థలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారని పోలీసులు చెప్పారు. కాగా, యువతి మృతదేహానికి ఉస్మానియా మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఉస్మానియా మార్చురీ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

# వానలు కురవాలి.. ఊరు చల్లగా ఉండాలి

- ఘనంగా రాజపేట పద్మశాలీల బోనాల వేడుకలు
- వర్షాలు సమృద్ధిగా కురవాలని బోనమెత్తిన పద్మశాలీలు
- గడికోట పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, నైవేద్యాల సమర్పణ



**తొలివెలుగు, రాజపేట :** వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ఊరంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ రాజపేట మండల కేంద్రంలో పద్మశాలి కులస్థులు ఆదివారం సామూహికంగా బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, మహిళలు సాంప్రదాయ దుస్తుల్లో తలపై బోనాలను ఎత్తుకుని డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగింపుగా బయలుదేరారు. ముందుగా బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు, అనంతరం గడికోటలోని పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించారు. పసుపు, కుంకుమలతో అలంకరించిన బోనాలతో మహిళలు భక్తిపారవశ్యంతో నైవేద్యాలు నివేదించారు. అమ్మవారి కృపాకటాక్షాలతో వానలు సమృద్ధిగా కురిసి గ్రామం చల్లగా ఉండాలని, రైతుల పంటలు బాగా పండాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వానాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో సాగు, తాగునీటి సమస్యలు తలెత్తకుండా అమ్మవారు కరుణించాలని ప్రార్థించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాలని, పల్లె సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. బంధుమిత్రుల సందడి, డప్పు చప్పుళ్లు, భక్తుల జైజయధ్వానాలతో రాజపేటలో బోనాల ఉత్సవాలు ఉత్సాహభరితంగా సాగాయి. పద్మశాలి కులస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహికంగా బోనాలు సమర్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేడుకలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరిగేలా పద్మశాలి సంఘం నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.



# ఒంటరిగా భోజనం చేస్తున్నారా? అయితే మీరు రిస్క్‌లో ఉన్నట్లే..!

## షాకింగ్ స్టడీ..








**తరుచుగా మీరు ఒంటరిగా భోజనం చేస్తున్నారా.? అయితే మీరు మానసిక, మెదడు ఆరోగ్యాన్ని పాడు చేసుకున్నట్లే.**

కలిసి భోజనం చేయడం కేవలం మనుషులను దగ్గర చేసే ఒక సామాజిక అలవాటు మాత్రమే కాదు, ఇది మన మానసిక ఆరోగ్యానికీ మేలు చేసే విషయమని పరిశోధకుల అధ్యయనం తేల్చింది. కుటుంబంతో కలిసి డిన్నర్ చేయడం, సహోద్యోగులతో కలిసి తినడం, స్నేహితులతో కలిసి భోజనం చేయడం వల్ల సామాజిక సంబంధాలే కాకుండా, ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని పరిశోధకులు చెబుతున్నారు.



### కలిసి భోజనం చేయడం వల్ల లాభాలు

- భావోద్వేగ ఆరోగ్యం మెరుగుపడతుంది
- మాట్లాడుకోవడం, అనుబంధాలు పెరుగుతాయి
- ఒంటరితనం తగ్గుతుంది
- సాంఘిక బంధాలు బలపడతాయి
- స్ట్రెస్ తగ్గుతుంది.. మానసిక ప్రశాంతత పెరుగుతుంది
- జీవనంపై సంతృప్తి పెరుగుతుంది






### ఒంటరిగా భోజనం.. డిప్రెషన్‌కు దారి

- కలిసి భోజనం చేయడంతో వల్ల భావోద్వేగ ఆరోగ్యం మధ్య సంబంధం ఉన్నట్లు పరిశోధనలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా వృద్ధుల్లో ఈ సంబంధం ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. తరచుగా ఇతరులతో కలిసి భోజనం చేసే వారితో పోలిస్తే ఒంటరిగా భోజనం చేసే వారిలో డిప్రెషన్ లక్షణాలు ఎక్కువగా ఉన్నట్లు పరిశోధకులు చెబుతున్నారు.
- వరల్డ్ హ్యాపినెస్ రిపోర్ట్ ప్రపంచవ్యాప్తంగా సుమారు 1.5 లక్షల మంది నుంచి సేకరించిన సమాచారాన్ని విశ్లేషించింది, తమకు తెలిసిన వ్యక్తులతో ఎంత తరచుగా లంచ్ లేదా డిన్నర్ చేస్తారనే ప్రశ్నలను కూడా పరిశోధకులు ఇందులో పరిగణనలోకి తీసుకున్నారు.

### మెదడు ఆరోగ్యంపై ప్రభావం!

- ఒంటరిగా భోజనం చేయడం దీర్ఘకాలిక మెదడు ఆరోగ్యంతో సంబంధం కలిగి ఉందా అనే అంశాన్ని శాస్త్రవేత్తలు పరిశీలిస్తున్నారు. జపాన్ పరిశోధకులు 2025లో నిర్వహించిన ఒక అధ్యయనంలో.. క్రమం తప్పకుండా ఒంటరిగా భోజనం చేసే వ్యక్తుల్లో మెదడులోని కొన్ని ప్రాంతాల్లో వాల్యూమ్ తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ముఖ్యంగా జ్ఞాపకశక్తి, కాగ్నిటివ్ ఫంక్షన్‌కు సంబంధించిన హిప్పోకాంపస్, మీడియల్ టెంపోరల్ లోబ్ వంటి ప్రాంతాల్లో ఈ తేడాలు కనిపించాయి. అయితే ఈ తేడాకు ఆహారపు అలవాట్లు కూడా కొంతవరకు కారణం కావచ్చని పరిశోధకులు వెల్లడించారు.



### కలిసి తినడం వెనుక జీవశాస్త్ర రహస్యం!

- కలిసి భోజనం చేసినప్పుడు ఆహారం మరింత ఆనందంగా అనిపించడానికి జీవశాస్త్రపరమైన కారణం కూడా ఉండవచ్చు. భోజనం చేయడం వల్ల శరీరంలోని ఎండార్ఫిన్ అనే వ్యవస్థ ప్రేరేపితం కావచ్చు. ఇది ఆనందం, సామాజిక అనుబంధంతో సంబంధం ఉన్న వ్యవస్థ. అందుకే భోజనం చేసే సమయంలో ఒంటరిగా కాకుండా స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి చేస్తే ప్రయోజనం ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు.



**గుర్తుంచుకోండి!** ఆహారం కేవలం ఆకలిని తీర్చదు.. అది అనుబంధాలను పెంచుతుంది, మనసును నింపుతుంది, మెదడును కాపాడుతుంది. సాధ్యమైనంత వరకు కలిసి భోజనం చేసేందుకు అలవాటు పడండి.

**కలిసి తినండి.. ఆరోగ్యంగా ఉండండి!** ♥



# నువ్వులతో ఆరోగ్య ప్రయోజనాలు ఇవే..

నువ్వులలో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్, విటమిన్లు, కాల్షియం, ఐరన్, మెగ్నీషియంతోపాటు ఇతర యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. నువ్వులను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు తెలుసుకుందాం.. పీచు పుష్కలంగా ఉండే నువ్వులను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి. కాబట్టి మధుమేహ వ్యాధిగ్రస్తులకు నువ్వులు చాలా మంచిది. నువ్వులు తింటే గుండె ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు జరుగుతుంది. వీటిలోని 'ఒలియిక్ యాసిడ్' , 'లినోలిక్ యాసిడ్' వంటివి శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. తద్వారా గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.

నువ్వులు ఎముకల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. నువ్వులలో ఉండే అధిక కాల్షియం దీనికి తోడ్పడుతుంది. ఆస్టియోపోరోసిస్ వంటి వ్యాధులతో పోరాడేందుకు నువ్వులను తీసుకోవాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. నువ్వులు మన జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో కూడా చాలా మేలు చేస్తాయి. నువ్వులలోని పీచు అరుగుదలకు తోడ్పడుతుంది. మలబద్ధకం వంటి జీర్ణ సమస్యల నుంచి బయటపడటానికి నువ్వులు దివ్యౌషధంగా పనిచేస్తాయి.

నువ్వులు మెదడు పనితీరును మెరుగుపరచడంలో కూడా సహాయపడతాయి. నువ్వులలో ఉండే అనేక పోషకాలు దీనికి ఉపయోగపడుతాయి. ముఖ్యంగా నువ్వుల్లో ఉండే విటమిన్ బి6 మెదడుకు మేలు చేస్తుంది. నువ్వులు మన చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, చర్మ వ్యాధులతో పోరాడటానికి సహాయపడతాయి. నువ్వులలోని విటమిన్-ఇ, యాంటీ ఆక్సిడెంట్లు ఇందుకు సహకరిస్తాయి.



**లెమన్ గ్రాస్ హెర్బల్ టీ చేయడానికి కావలసిన పదార్థాలు**

- నిమ్మ గడ్డి - ఒక కప్పు
- ఏలకులు - రెండు
- అల్లం - చిన్న ముక్క
- లవంగాలు - 2
- తులసి - 2-4 ఆకులు
- తేనె - ఒక చెంచా
- నిమ్మరసం - ఒక టీస్పూన్

# లెమన్‌గ్రాస్ హెర్బల్ టీ తయారు చేసే విధానం..

లెమన్ గ్రాస్‌లో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ గుణాలున్నాయి. ఇవి జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తాయి. శరీరం నుంచి విషాన్ని తొలగించడానికి లెమన్ గ్రాస్ హెర్బల్ టీ చాలాబాగా ఉపయోగపడుతుంది. అంతేకాదు బరువు తగ్గాలనుకునే వారికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రతిరోజూ ఉదయం ఈ హెర్బల్ టీ తాగితే రక్తపోటు అదుపులో ఉంటుంది. రోగనిరోధక శక్తిని పెంపొందించడంలోనూ దీని పాత్ర కీలకం. లెమన్ గ్రాస్ హెర్బల్ టీ చర్మాన్ని ఆరోగ్యంగా, మెరిసేలా చేస్తుంది.

**లెమన్ గ్రాస్ హెర్బల్ టీని ఎలా తయారు చేయాలి..?**

లెమన్ గ్రాస్ టీ చేయడానికి, ముందుగా పాన్‌లో నీటిని వేడి చేయండి.
దీని తరువాత అన్ని మూలికలు, సుగంధ ద్రవ్యాలు వేసి కలపాలి.
తర్వాత ఈ మిశ్రమాన్ని నీటి రంగు మారే వరకు ఉడికించాలి.
దీని తరువాత, నీరు లేత బంగారు రంగులోకి మారినప్పుడు, మంట ఆపివేయండి. లెమన్ గ్రాస్ హెర్బల్ టీ రెడీ.. దీన్ని ఒక కప్పులో వడకట్టి నిమ్మరసం, తేనె కలిపి తాగాలి.

# అవకాడో మెదడుకు అద్భుతమైన సూపర్ ఫుడ్..

అవకాడోలో డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది గట్ మైక్రోబయోమ్‌కు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది ఒమేగా 6 కొవ్వు ఆమ్లాలను కలిగి ఉంటుంది. ఇది కేంద్ర నాడీ వ్యవస్థకు మంచిది. ఇది అల్జీమర్స్, డిమెన్షియా వంటి వ్యాధులను నివారిస్తుంది. అవకాడో చర్మానికి చాలామంచిది. యాంటీ ఏజింగ్ ఏజెంట్ గా పనిచేస్తుంది. ఇది చర్మం పొడిబారడాన్ని పోగొట్టి, ముఖాన్ని మెరిసేలా చేస్తుంది. అంతేకాదు కళ్ల కింద నల్లటి వలయాలను కూడా తొలగిస్తుంది.



### అవకాడో

అవకాడోలో యాంటీ రేడియేషన్ ఏజెంట్లు కూడా ఉన్నాయి. ఇవి ఫైటోఈస్ట్రోజెనిక్. అంటే పునరుత్పత్తి, పెద్దప్రేగు క్యాన్సర్ వంటి ఈస్ట్రోజెన్ సంబంధిత క్యాన్సర్‌లను దూరంగా ఉంచడంలో హాయపడుతుంది.

### జీర్ణ సంబంధిత సమస్యలు..

తేలికగా జీర్ణమయ్యే ఈ పండు జీర్ణ సంబంధిత సమస్యలు ఉన్నవారికి మరింత ఉపయోగకరంగా ఉంటుంది. ఒమేగా 6 ఫ్యాటీ యాసిడ్స్, హెల్తీ ఫ్యాట్స్, ఫైటోన్యూట్రియెంట్స్ వంటి కంటెంట్స్ అవకాడోలో ఉంటాయి. ఇవి మెదడును ఆరోగ్యంగా ఉంచుతాయి. ఇలాంటి కచ్చితమైన ఆరోగ్య సమాచారాన్ని అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు అందించే మరిన్ని విషయాలను గురించి మీరు తెలుసుకోవాలంటే సాక్షి లైఫ్ ను ఫాలో అవ్వండి..






# ట్రంప్‌కు ఎదురుగాలి!

రెండో దఫా అధికార పీఠం అధిరోహించి కూడా రెండేళ్లు కావస్తున్నా అమెరికా అధ్యక్షుడు డోనాల్ట్ ట్రంప్‌కు దౌత్యనీతి ఒంటబట్టలేదు. తాను నిర్దేశించినదాన్ని అంగీకరించటమే తప్ప మరోవిధంగా మాట్లాడే హక్కు, అధికారం ఏ దేశానికీ లేదని ఆయన ఇప్పటికీ నమ్ముతున్నారు. ఆయన దృష్టిలో కేవలం అదే దౌత్యం. భారత్ నుంచి కెనడా వరకూ... ఇరాన్ నుంచి వెనిజులా వరకూ ఆయనది ఇదే బాణీ. ట్రంప్‌ను నేరుగా ప్రతిఘటించే వారుండొచ్చు, పరోక్షంగా చెప్పిచూద్దామనుకునే వారుండొచ్చు... మార్గాలు వేరైనా ట్రంప్ షరతులకు తలొగ్గబోమని చెప్పడమే వీరందరి సారాంశం. చాన్నాళ్లుగా విసుగెత్తి ఉన్నారేమో... కెనడా ప్రధాని మార్క్ కెర్నీ చాలా కరకుగానే వ్యవహరించారు. ఒకదాని వెంబడి మరో గొంతెమ్మ కోర్కెతో చీకాకుపరుస్తున్న అమెరికా తీరును నిరసిస్తూ వాణిజ్య ఒప్పందంపై చర్చలు సాగిస్తున్న తమ ప్రతినిధి బృందాన్ని వెనక్కురావాలని ఆదేశించారు. ఒప్పందం దాదాపు ఖరారై సంతకాలు జరపడమే తరువాయి అనుకునే దశలో ఎదురైన ఈ ఊహించని పరిణామం అమెరికాను అయోమయంలోకి నెట్టింది. ఇలాంటి భంగపాట్లే ఇరాన్ దగ్గర ఎదురయ్యాయి. మన దేశంతో చర్చలు ఒక కొలిక్కి వచ్చాయని అమెరికా అనేకమార్లు ప్రకటించింది. కానీ అదేమీ జరగలేదు. వెనిజులా అధ్యక్షుడు మదురోను ట్రంప్ తన సైన్య బలంతో ఈ ఏడాది మొదట్లో అపహరించి, అమెరికాలో ఆయనపై విచారణ తంతు సాగిస్తున్నారు. ఇకపై అది తమ భూభాగమని అమెరికా చెప్పడం ఆ దేశ ప్రజల్ని మాత్రమే కాదు... అత్యధిక దేశాలను ఆగ్రహోదగ్రుల్ని చేస్తోంది. ఇక ఇరాన్ సంగతి చెప్పనవసరం లేదు. యుద్ధాన్ని తాత్కాలికంగా నిలిపేశామని చెప్పటం నుంచి హార్మూజ్ తమదేనని ప్రకటించటం వరకూ ట్రంప్ ఎన్ని చేసినా ఇరాన్ నిబ్బరంగా 'నీ లెక్కేమిట'న్నట్టే వ్యవహరిస్తోంది. మిత్ర దేశమైన దక్షిణ కొరియాదీ అదే వైఖరి. ఏటా 11 రోజులపాటు అమెరికా, దక్షిణ కొరియాలు ఉమ్మడి సైనిక విన్యాసాలు జరుపుతాయి. ఈసారి అయిదో రోజుకల్లా అమెరికా సైనికులు తట్టా బుట్టా సర్దుకుని తిరుగుముఖం పట్టారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్‌జోంగ్ ఉన్‌తో చెలిమి కోసం ట్రంప్ తహతహలాడటంపై ఆగ్రహించి దక్షిణ కొరియా ఈ నిర్ణయం తీసుకుందంటున్నారు. ఈ విన్యాసాల ఉద్దేశం ఉత్తర కొరియాను భయపెట్టడం. తీరా ఆ దేశంతోనే అమెరికా చేతులు కలుపుతుంటే... ఈ విన్యాసాలకు అర్థమేమిటన్నది దక్షిణ కొరియా ప్రశ్న. వాస్తవానికి ఉత్తర కొరియా పూర్తి స్థాయి అణ్వస్త్ర దేశంగా మారింది. ఆ దేశం దగ్గర 'చాలా శక్తిమంతమైన' ఆయుధాలున్నాయని ట్రంపే కొద్దికాలం క్రితం ప్రకటించారు. దాన్ని మరిచి కొత్త చుట్టరికాలు కలుపుకుందామని ట్రంప్ ప్రయత్నించినంత మాత్రాన ఆ దేశం నమ్మే అవకాశమేమీ లేదు. ఇరాన్‌తోసహా అన్ని దేశాలతోనూ దౌత్యపరంగా వరస వైఫల్యాలు తప్పడం లేదు గనుక ఉత్తర కొరియాకు దగ్గరై అమెరికా జనాన్ని ఆశ్చర్యపరచాలని ట్రంప్ భావిస్తున్నట్టు కనబడుతోంది. కానీ వేరే దేశాలతో పెంచుకున్న వైరం వికటిస్తున్న విధంగానే ఉత్తర కొరియాతో చెలిమి సైతం బెడిసికొట్టే అవకాశం లేకపోలేదు. చివరకు ఉత్తర కొరియాఏం చేస్తుందన్నది అలావుంచితే... ఆసియా--పసిఫిక్ దేశాలన్నిటా ట్రంప్ అంతరంగంపై ఇప్పటికే ఉన్న సందేహాల్ని మరింతగా పెంచింది. ఈ దేశాలన్నీ చైనా దూకుడువల్ల చాలా ఇబ్బంది పడుతున్నాయి. ఇలాంటి సమయంలో తమకు అండగా నిలిచి, చైనాకు కళ్లెం వేయాల్సిన అమెరికా ఆడుతున్న వింతనాటకాలు వాటికి మింగుడుపడటం లేదు. అందుకే దక్షిణ కొరియా, జపాన్ ఇటీవల సాన్నిహిత్యమవుతున్నాయి. ఆ రెండింటిమధ్యా ఇబ్బందికర చరిత్రవున్నా ట్రంప్ వింత చేష్టలు వారిని సన్నిహితం చేశాయి. కెనడా ఉత్పత్తులపై 50 శాతం అదనపు సుంకాలు వేయాల్సివస్తుందని ట్రంప్ ప్రకటించగా, దానికి ప్రతిగా వచ్చే నెల 8 నుంచి అమెరికా ఉత్పత్తులపై 15 నుంచి 50 శాతం వరకూ సుంకాలు విధిస్తామని కెర్నీ ప్రకటించారు. అమెరికా అదనపు సుంకాల విలువ 2,000 కోట్ల డాలర్లయితే, కెనడా సుంకాలు 2,760 కోట్ల డాలర్లు.

# అబద్ధాల సీఎంకు అగౌరవ సత్కారం!

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఢిల్లీ రాజకీయ వర్గాల్లో వ్యంగ్యాస్త్రాలు పేలుతున్నాయి. ఒక అంశంపై ఒక్కోసారి ఒక్కోలా మాట్లాడిన తీరుపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇటీవల ఢిల్లీ వెళ్లినప్పుడు అక్కడి మిత్రులతో మాటామంతిలో విన్న కొన్ని పదాలు ఆశ్చర్యం కలిగించాయి. ఒక ముఖ్యమంత్రిని ఉద్దేశించి ఇంతటి చులకనభావంతో కూడిన పదాలు వాడుతున్నరా అని ఆశ్చర్యం కలిగింది. కానీ ఆ వ్యంగ్యంలో రాజకీయ కోణం లేదు. ఆ పదాలు ఎందుకు పుట్టాయన్నదే అసలు చర్చ. ప్రభుత్వ నిర్ణయాల్లో స్పష్టత ఉన్నదా? ఎన్నికలకు ముందు చెప్పిన మాటలకు, అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకున్న నిర్ణయాలకు మధ్య పొంతన ఉన్నదా? ప్రజలకు ఇచ్చిన హామీల అమలు సంగతేంది? అనే ప్రశ్నలే ఇప్పుడు చర్చకు కేంద్రంగా మారుతున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ విస్తృతమైన హామీలతో ప్రజల ముందుకు వచ్చింది. స్థూలంగా వాటిని ఆరు గ్యారెంటీలుగా ప్రకటించుకున్నది. ఒక్కొక్క గ్యారంటీ అనేక అంశాలతో కలిపి 420 హామీలుగా ఇచ్చింది. ఇవి మాత్రమే కాదు. యువత, రైతులు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు ప్రత్యేక డిక్లరేషన్లు కూడా ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని నమ్మబలికింది. కల్యాణలక్ష్మి పథకంలో లక్ష రూపాయలతోపాటు తులం బంగారం కూడా ఇస్తామని తెలిపింది. కాలేజీ విద్యార్థినులకు స్కూటీలు, నిరుద్యోగులకు భృతి ఇస్తామని తెలిపింది. తమ పార్టీకి పాలనలో అపారమైన అనుభవం ఉన్నదని, అన్ని విషయాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈ హామీలు ఇచ్చామని చెప్పుకొచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ నేతలు మాట మార్చారు. హామీలు అటకెక్కాయి. ప్రజలకు ఇచ్చిన మాటకు, పాలనా వాస్తవాలకు మధ్య పొంతనలేదు. రాజకీయ నాయకుడికి మాటలే పెద్ద ఆయుధం. కానీ ఆ మాటలు అమలులో డొల్లబారి కల్లలైనప్పుడు ప్రజల నుంచి తీవ్రమైన నిరసనలను ఎదుర్కోవలసి వస్తుంది. రేవంత్‌రెడ్డి గతంలో ఒక టీవీ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన కొన్ని వ్యాఖ్యలు కూడా రాజకీయ చర్చల్లో ప్రస్తావనకు వస్తున్నాయి. అబద్ధాలు చెప్తేనే ప్రజలు ఓట్లు వేస్తారని, మోసం చేయడంలో తప్పు లేదని, అలవి కాని హామీలు ఇవ్వడం రాజకీయాల్లో సాధారణమని సీఎం బాహాటంగా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు ఆయన రాజకీయ ఆలోచనా విధానానికి, ప్రజల పట్ల ఆయనకు గల చులకన భావానికి నిదర్శనం. ఈ వ్యాఖ్యలు ఆయన రాజకీయ ఆలోచనా విధానానికి ప్రతిబింబంగా ప్రజలు ఇప్పుడు గుర్తించారు. ప్రజల మీద ఆయనకు గల చులకన భావాన్ని అర్థం చేసుకున్నారు. ఇప్పుడు ప్రజలు అడుగుతున్న ప్రశ్నలు ఏంటంటే, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి అవసరమైన ఆర్థిక ప్రణాళిక అప్పుడే సిద్ధంగా ఉన్నదా.



# ఈ విలయం ఎవరి పాపం?

హిమవత్పర్వత శ్రేణి రాళ్లూ రప్పల సమూహం కాదు... అది ప్రకృతి చెక్కిన ఒక అద్భుత దృశ్యకావ్యం. ఈ సౌందర్యం కాస్తా రెప్పపాటులో మృత్యుగీతం ఆలపిస్తుంది. జనావాసాలను క్షణంలో శ్మశాన వాటికలుగా మారుస్తుంది. బుధవారం నేపాల్--టిబెట్ సరిహద్దుల్లో అతి పెద్ద మంచుఖండం విరిగి భోటే కోశీ నదిలో పడటంతో మెరుపు వరదలు సంభవించి 350 మంది వరకూ మరణించారని అంటున్నారు. 30కిపైగా దేశాలకు చెందిన 1,300 మంది గల్లంతయ్యారు. వారిలో 290 మంది భారతీయులు. నది దిగువనవున్న అనేక జనావాసాలు, డజను జలవిద్యుత్ ప్రాజెక్టులు, వంతెనలు, రహదార్లు కొట్టుకు పోయాయి. హిమాలయాల్లో ఇలాంటి ఉదంతాలు రివాజుగా మారినా, ఈసారి ఉత్పాతం అతి పెద్దదని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. ఈ దారుణానికి కారణమేమిటో స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. రిక్టర్ స్కేల్‌పై 4.4 తీవ్రతతో భూకంపం సంభవించటంవల్లే ఇలా జరిగిందని తొలుత వార్తలొచ్చాయి. అయితే దాన్ని నిర్ధారించే ఉపగ్రహ చిత్రాలేమీ లేకపోవటంతో తీవ్ర వాతావరణ స్థితిగతులవల్లే మంచుఖండం కరిగి విరిగిపడి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. వాతావరణంలో కర్బన ఉద్గారాలు పెరగటంవల్ల భూమి నానాటికీ వేడెక్కుతోంది. కాలుష్యకారక దేశాల్లో తొలి స్థానం అమెరికాది. అటు తర్వాత స్థానం చైనాది కాగా, మూడో స్థానం మనది. నాలుగో స్థానం యూరోప్ దేశాలది. కర్బన ఉద్గారాల విడుదలలో నేపాల్ స్థానం 95. అంటే ప్రపంచాన విడుదలయ్యే కర్బన ఉద్గారాల్లో ఒక శాతంలో పదో వంతు వాటా మాత్రమే నేపాల్‌ది. వాతావరణ మార్పుల తాకిడికి నష్టపోయే దేశాల్లో మాత్రం ఆ దేశానిది ఆరో స్థానం. అతి తక్కువ కాలుష్యానికి కారణమవుతూ అతి ఎక్కువ మూల్యం చెల్లిస్తున్న దేశంగా నేపాల్‌ను చెబుతారు. ఇప్పుడంటే సూపర్ ఎల్‌నినో వచ్చిపడిందిగానీ... గత దశాబ్దకాలంగా ప్రకృతి వైపరీత్యాలు వేధిస్తూనే ఉన్నాయి. వాటిని ముందుగా పసిగట్టే సాంకేతికతలు అనుకున్నంతగా అభివృద్ధి చెందకపోయినా, గతంతో పోలిస్తే ఎంతో మెరుగైన ఉపకరణాలు అమెరికా, చైనాలవద్ద ఉన్నాయి. తమ కారణంగా యేటా భారీ నష్టాన్ని చవిచూస్తున్న నేపాల్‌కు ఆ సాంకేతికతల్ని ఉచితంగా ఇచ్చి ఆదుకోవటం తమ నైతిక ధర్మమని అవి రెండూ అనుకోవు. ఫలితంగా చెప్పాపెట్టకుండా మెరుపు వరదలు విరుచుకుపడటం నేపాల్‌లో మామూలు విషయంగా మారింది. భోటే కోశి నది టిబెట్‌లో మొదలవుతుంది. కొడారి దగ్గర ఒక పాయ, రసువా దగ్గర మరో పాయ నేపాల్‌లోకి ప్రవేశిస్తాయి. నిరుడు సైతం ఆ నదికి ఇలాగే వరదలొచ్చాయి. గత నెల 8న రసువా దగ్గరొచ్చిన వరదల్లో 18 మంది చనిపోగా, అనేక జలవిద్యుత్ ప్రాజెక్టులు, వంతెనలు, విద్యుత్ పంపిణీ వ్యవస్థలు ధ్వంసమయ్యాయి. వర్షపాతం, వరదనీటి ప్రవాహాల గురించిన డేటా చైనా ఎప్పటికప్పుడు అందిస్తే ప్రాణనష్టాన్ని నివారించే వీలుంటుంది. దేశంలోకి వరద నీరు ప్రవేశించటం మొదలయ్యాకే పౌరుల్ని హెచ్చరించే స్థితి ఉండటం నేపాల్‌కి విషాదం మిగులుస్తోంది. కొన్నిసార్లు మంచుపలకలు విరిగి భోటే కోశి ప్రవాహ మార్గాన్ని కప్పేస్తాయి. అప్పుడు దిగువన నేపాల్‌లో నది నిండుకుంటుంది. దాన్నొక ముందస్తు హెచ్చరికగా తీసుకుంటారు. ఇలాంటి వైపరీత్యాలు జరిగినప్పుడు మౌలిక సదుపాయాల పునర్నిర్మాణం తప్పదు. నిరుడు బేత్రావతి--రసువాగడి కారిడార్‌ను వరదలు ముంచెత్తి భారీ నష్టం జరిగింది. అతి కష్టంపై వాటన్నిటినీ పునర్నిర్మించారు. అవన్నీ తాజా వరదల్లో మళ్లీ కొట్టుకు పోయాయి. పదిపదిహేనేళ్ల డేటా అందుబాటులో ఉండి అధ్యయనం చేయగలిగితే నది నడత అంచనాకు, దానికి అనుగుణంగా కనిష్ఠ స్థాయి నష్టం మాత్రమే ఉండేలా నిర్మాణాలు చేపట్టడానికి కొంతవరకూ వీలవుతుంది. భారీ జననష్టం, ఆస్తినష్టం కలగజేసే వైపరీత్య సమాచారం సైతం సరిహద్దుల ఆవలే నిలిచిపోతే మానవాళి సాధించిన అభివృద్ధికి అర్థం ఉండదు. దానికన్నా ముందు సంపన్న దేశాలు తమ అభివృద్ధి నమూనాలను మార్చుకోవాలి. వైపరీత్యం వచ్చిపడ్డాక సాయం చేయటానికి ముందుకు రావటం మెచ్చదగిందే అయినా, దాని నివారణకు తమ వంతు చేయాల్సిందేమిటో అవి గుర్తెరగాలి. బాధ్యతారహిత ప్రవర్తన ఏదో ఒకరోజు తమను కూడా ధ్వంసించగలదని తెలుసుకోవాలి.

# కాక్రోచ్‌లపై దండయాత్రలా!

దేశ రాజధానిలోని జంతర్‌మంతర్‌లో జెన్ జీ సాగించిన ఉద్యమం తర్వాత బీజేపీ, ఆరెస్సెస్‌లతోపాటు రాజకీయ పక్షాలన్నీ మేల్కొన్నాయి. ఆ తరానికి చేరువకావటానికి... దాని ఆశలేమిటో, ఆకాంక్షలేమిటో తెలుసుకోవటానికి ప్రయత్నించటం మొదలెట్టాయి. ఇవన్నీ ఆశావహమైన మార్పులకు సంకేతంగా అందరూ భావించారు. కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) ఈ ఉద్యమాన్ని పాఠశాలలకు సైతం విస్తరించాలని సంకల్పించి, 'స్కూల్ ఠీక్ కరో' పేరిట వివిధ రాష్ట్రాల్లో బడుల స్థితిగతులు బయటపెట్టేందుకు నడుం కట్టింది. కానీ చాలాచోట్ల దానికెదురవుతున్న ఆటంకాలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. రాజస్థాన్‌లో జైపూర్ సమీపంలోని రాంపురా కన్వర్‌పురా గ్రామంలో పట్టుమని పదిమంది కూడా లేని సీజేపీ బృందంపై గ్రామస్థులమని చెప్పుకున్నవారు రాళ్లతో దాడిచేశారు. ఒకరి చేయి విరగ్గొట్టారు. మహిళల్ని కూడా మినహాయించలేదు. వాహనాలు ధ్వంసం చేశారు. గొడ్లపాకలో నడుస్తున్న ఈ బడి గురించి ఒక చానెల్‌లో వచ్చిన కథనంతో జెన్ జీ ఆ గ్రామానికి వెళ్లింది. కొన్ని రోజుల క్రితం పశ్చిమ బెంగాల్‌లోనూ ఇంతే. ఒక పాఠశాల వీడియో తీసేందుకు అనుమతి కోరిన సీజేపీ కార్యకర్త ఇంటిపై గుంపు దాడిచేసి అతన్ని కొట్టబోగా, అడ్డొచ్చిన అతని తండ్రి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ఉత్తరప్రదేశ్‌లో బడి పిల్లల్ని రెచ్చగొడుతున్నారంటూ పలు జిల్లాల్లో అనేకమందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. శిథిలావస్థలో ఉన్న బడుల్ని చూపించిన యూట్యూబర్‌లపై కేసులు పెట్టారు. బిహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లోనూ సీజేపీ కార్యకర్తలపై కేసులు నమోదయ్యాయి. ఈ పాలకులకు ఏమైంది? బడి బాగులేదంటే, ఉపాధ్యాయుల కొరత ఉందంటే, బడుగుల పిల్లలకు నాసిరకం చదువులే దక్కుతున్నాయంటే వీరెందుకు ఉలిక్కిపడు తున్నారు? బయటి ప్రపంచానికి తెలియకూడదని ఎందుకంత ఆత్రం? నిజానికి జంతర్ మంతర్ ఆందోళన ముగియటానికి కొంచెం అటూ ఇటూగా జెన్ ఆల్ఫా









పిల్లలు రోడ్డెక్కారు.లక్నో శివారులో ఒక బడినుంచి వెల్లువలా బయటికొచ్చిన ఆడపిల్లలు రహదారిని దిగ్బంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వచ్చింది. పిల్లలు ఏకరువుపెట్టిన సమస్యలు, వారి భావోద్వేగాలు అందరినీ ఆశ్చర్యపరిచాయి. జిల్లా కలెక్టర్ వచ్చి హామీ ఇస్తే తప్ప ఆందోళన విరమించలేదు. ఆ వెంటనే నలుగురు కొత్త టీచర్లొచ్చారు. ఈమధ్య జరిగిన కేంద్ర కేబినెట్ భేటీలో ప్రధాని నరేంద్ర మోదీ చెప్పిందేమిటి? రాష్ట్రాల్లో పాలకులు చేస్తున్నదేమిటి? 'ఒక రోజు, ఒక యూనివర్సిటీ' కార్యక్రమం చేపట్టాలని కేంద్రమంత్రులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు, పనితీరు స్థానిక ప్రతినిధులద్వారా తరచు తెలుసుకోవాలని కోరారు. అదే పని సీజేపీ చేస్తే తప్పేమిటి? సమస్యలేమిటో, పిల్లలు పడుతున్న బాధలేమిటో బయటి ప్రపంచానికి చెప్పడంకాక, వారివల్ల ఇంకేం జరుగుతుందని ప్రభుత్వాలు వణుకుతున్నాయి? స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలవుతున్నా ఒకే ఒక్క గదితో, అయిదు తరగతులకు ఒకే టీచర్‌తో కొన్ని బడులు నడుస్తున్నాయంటే వింతకాదా? దేశంలో ఏకంగా 29 లక్షలమంది పిల్లలు చదువుకునే బడులు ఏకోపాధ్యాయ పాఠశాలలు! బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మాత్రమే కాదు... ఇతరచోట్ల సైతం ఇలాంటి దుఃస్థితే. ఆంధ్రప్రదేశ్‌లో 2019--24 మధ్య వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎవరూ కోరకుండానే రూ. 11,700 కోట్లతో 'మన బడి: నాడు--నేడు' కార్యక్రమం కింద వేలాది పాఠశాలలకు సౌకర్యవంతమైన భవంతులు నిర్మించింది. కార్పొరేట్‌లను తలదన్నే సదుపాయాలు కల్పించింది. 38,059 బడుల రూపురేఖల్ని మార్చింది. మరిన్ని పాఠశాలలకు విస్తరించాల్సివున్న తరుణంలో... కూటమి ప్రభుత్వం వచ్చి కొత్త నిర్మాణాల సంగతలావుంచి, మెరుగుపడిన బడుల్ని కాస్తా నాశనం చేసిపెట్టింది. అందుకే సీఎంలంతా తమ నిర్వాకాన్ని సమీక్షించుకుని దిద్దుబాటుకు సిద్ధపడాలి. లక్ష్య నిర్దేశం చేసుకుని బడుల్ని బాగుచేస్తామని హామీ ఇవ్వాలి. అధికారం ఉందికదా అని పోలీసులతో, రౌడీలతో బెదరగొడదామనుకుంటే ఆ చర్యలు వికటిస్తాయి. మూర్ఖత్వాన్ని వదులుకుని సావధానంగా ఆలోచించటం... రేపటి పౌరుల శ్రేయస్సుకోసం సరైన నిర్ణయాలు తీసుకోవటం అవసరమని గుర్తించాలి.

## బాలయ్య-కొరటాల సినిమాలో కోలీవుడ్ స్టార్ హీరో..!

టాలీవుడ్ ఇండస్ట్రీలో ప్రస్తుతం చర్చ జరుగుతున్న కాంబినేషన్ నందమూరి బాలకృష్ణ మరియు మాస్ డైరెక్టర్ కొరటాల శివ కలయిక. 'దేవర' సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న కొరటాల శివ, తన తదుపరి ప్రాజెక్ట్‌ను నందమూరి బాలకృష్ణ హీరోగా తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాత సుధాకర్ చెరుకూరి భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. తాజాగా ఈ సినిమా గురించి ఫిల్మ్ నగర్ వర్గాల్లో వినిపిస్తున్న కొన్ని వార్తలు అటు నందమూరి అభిమానుల్లో, ఇటు సినీ వర్గాలలో విపరీతమైన అంచనాలను పెంచేస్తున్నాయి. ఈ చిత్రంలో బాలకృష్ణను ఇప్పటివరకు చూడని సరికొత్త మాస్ అవతార్‌లో దర్శకుడు చూపించబోతున్నట్లు తెలుస్తోంది. కేవలం యాక్షన్ కే పరిమితం కాకుండా, కథలో బలమైన ఫ్యామిలీ ఎమోషన్స్‌కు కొరటాల శివ పెద్దపీట వేస్తున్నారట. ఇప్పటివరకు ఆయన తెరకెక్కించిన సినిమాలన్నింటికీ ఒక బలమైన సామాజిక నేపథ్యం లేదా ప్రత్యేకమైన బ్యాక్‌డ్రాప్ ఉండటం విశేషం. ఇప్పుడు ఈ సినిమా కోసం కూడా అదే స్థాయిలో ఒక యూనిక్ బ్యాక్‌డ్రాప్‌ను సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం నెటిజన్లు మరియు సినీ విశ్లేషకులు ఈ సినిమా కథ ఏ నేపథ్యంతో సాగుతుందనే దానిపై సోషల్ మీడియాలో రకరకాల చర్చలు జరుపుతున్నారు. అంతేకాకుండా, ఈ సినిమాలో ఒక ప్రత్యేకమైన కీలక పాత్ర కోసం కోలీవుడ్ స్టార్ హీరో ఆర్యను సంప్రదించే పనిలో కొరటాల శివ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో ఆర్య ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించబోతున్నాడని, ఆయన పాత్ర సినిమాకే ఒక మేజర్ హైలైట్‌గా నిలుస్తుందని సమాచారం. కథా చర్చలు పూర్తి కావడంతో త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే



అవకాశం ఉంది. హ్యాట్రిక్ విజయాల జోరుమీదున్న బాలయ్య బాబుతో, మాస్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే కొరటాల శివ చేతులు కలపడంతో బాక్సాఫీస్ వద్ద మరో సంచలనం ఖాయమని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.

## రెమ్యునరేషన్ పెంచేసిన మమిత బైజు..



'ప్రేమలు' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న మలయాళ ముద్దుగుమ్మ మమిత బైజు ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతోంది. కేవలం నెల రోజుల వ్యవధిలోనే మూడు వేర్వేరు భాషల్లో మూడు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చి తన సత్తా చాటింది. మూడు చిత్రాల్లో రెండు సూపర్ హిట్ కాగా, ఒకటి ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. ఇటీవల తమిళంలో వచ్చిన 'జన నాయగన్' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఫ్లాప్‌గా నిలిచినప్పటికీ, మమిత నటనకు మాత్రం మంచి ప్రశంసలు దక్కాయి. ఆ తర్వాత వచ్చిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రంలో అల్లరిపిల్లగా సందడి చేసి బాక్సాఫీస్ వద్ద మంచి హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఇక మలయాళంలో నివిన్ పాలీతో కలసి నటించిన 'బెత్లెహేమ్ కుడుంబ యూనిట్' చిత్రం ఏకంగా రూ. 174 కోట్లు రాబట్టి ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 4న 'బెత్లెహేమ్ కుటుంబ యూనిట్' పేరుతో తెలుగులో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. వరుస విజయాలు వరుస విడుదలలతో మంచి ఫామ్‌లో ఉన్న మమిత బైజు తన డిమాండ్‌కు తగ్గట్టుగా పారితోషికాన్ని భారీగా పెంచేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె ఒక్కో ప్రాజెక్ట్‌కు రూ. 3 కోట్ల వరకు రెమ్యునరేషన్ డిమాండ్ చేస్తోందని కోలీవుడ్, టాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. నిర్మాతలు కూడా ఆమెకున్న క్రేజ్ దృష్ట్యా ఈ స్థాయి పారితోషికం ఇచ్చేందుకు వెనుకాడటం లేదని సమాచారం. ప్రేమలుతో స్టార్ట్ అయిన మమిత హవ రాబోయే రోజుల్లో ఎంత వరకు వెళ్తుందో చూడాలి.

## 'తెల్లకాగితం' విడుదల అప్పుడే

'కోర్ట్'ఫేం హర్ష్ రోషన్ హీరోగా రూపొందుతున్న యువతరం ప్రేమకథ 'తెల్ల కాగితం'. నక్షత్ర కథానాయిక. రమేశ్ బండ్రెడ్డి దర్శకుడు. కృష్ణ కొమ్మాలపాటి నిర్మాత. అక్టోబర్ 2న సినిమా విడుదల కానున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆదివారం మేకర్స్ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో హీరోహీరోయిన్లు హర్ష్‌రోషన్, నక్షత్ర ఎంతో క్యూట్‌గా కనిపిస్తున్నారు. కురుస్తున్న వర్షపు చినుకులు, గొడుగులా అడ్డు పెట్టుకున్న అరిటాకు, నాయకానాయికల రొమాంటిక్ లుక్స్.. ఇవన్నీ ఎంతో సహజంగా.. సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉన్నాయి. ఇప్పటికే విడుదల చేసిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై అంచనాలు పెంచిందని, అన్ని వర్గాల ప్రేక్షకులనూ ఆకట్టుకునేలా సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి రచన: నందు సవిరిగాన, కెమెరా: కేవీ గుహన్, సంగీతం: విజయ్ బుల్గానిన్, నిర్మాణం: అరుణాచల క్రియేషన్స్.



## 'ఆదర్శకుటుంబం' కోసం క్లాసిక్ సాంగ్ రీమేక్?

తెలుగు ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమాల్లో వెంకటేశ్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'ఆదర్శకుటుంబం: హౌస్ నెం 47' సినిమా ముందు వరుసలో ఉంటుంది. వెంకటేశ్ నటించిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు రాశారు. ఆ సినిమాల విజయాల్లో వెంకటేశ్ నటన, త్రివిక్రమ్ రచన ప్రధాన పాత్రలు పోషించాయనడం అతిశయోక్తి కాదు. అప్పుడు వెంకటేశ్ సినిమాకి రచయితగా పనిచేసిన త్రివిక్రమ్.. ఇప్పుడు అదే వెంకటేశ్‌ని డైరెక్ట్ చేస్తున్నారు. దాంతో 'ఆదర్శకుటుంబం' సినిమాపై ఆడియన్స్‌లో అంచనాలు ఆకాశమంత ఏర్పడ్డాయి. అక్టోబర్ 2న గాంధీజయంతి కానుకగా సినిమా విడుదల కానున్నది. ఇదిలావుంటే.. ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం ఫిల్మ్ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నది. ఆ వివరాల్లోకెళ్తే.. వెంకటేశ్ చిత్ర విజయాల్లో 'కూలీ నెం 1' సినిమా ఒకటి. ఆ సినిమాలోని 'దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా.. దయుంచయ్యా దేవా..' సాంగ్ ఎంత హిట్టో అందరికీ తెలిసిందే. వినాయకచవితి పందిళ్లలో నేటికీ ఈ పాట మారుమోగుతూనే ఉంది. ఆ పాటను ఈ సినిమా కోసం రీమేక్ చేస్తున్నట్టు తెలిసింది. ఇదే నిజమైతే.. సినిమాకు ఈ పాట ప్రత్యేక ఆకర్షణ కాకమానదు. క్లైమాక్స్, ఓ పాట మినహా ఈ సినిమా షూటింగ్ పూర్తయిందని టాక్. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా సాగే ఈ సినిమాలో శ్రీనిధిశెట్టి కథానాయిక. నివేదా పేతురాజ్, యువిన, రాజ్ ప్రజ్వల్, రావురమేశ్, సత్య, బ్రహ్మాజీ ఇతర పాత్రధారులు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఈచిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే.





## రాజ్ తరుణ్ 'టార్టాయిస్'

రాజ్ తరుణ్ నటిస్తున్న తాజా చిత్రానికి 'టార్టాయిస్' అనే పేరును ఖరారు చేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆదివారం ప్రకటన విడుదల చేశారు. అమృత చౌదరి కథానాయిక. అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ కీలక పాత్రధారులు. రిత్విక్ కుమార్ దర్శకత్వంలో విజయ్ చౌదరి, శశిధర్ నల్ల, రామిశెట్టి రాంబాబు నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నది. ఆదివారం టైటిల్ అనౌన్స్‌మెంట్‌తో పాటు ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని కూడా మేకర్స్ విడుదల చేశారు. డెడ్‌బాడీ పక్కనే రక్తపు మరకలతో కూర్చుని వున్న రాజ్‌తరుణ్‌ని ఈ ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో చూడొచ్చు. సస్పెన్స్, డ్రామా కలగలిసిన ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ కథాంశంతో దర్శకుడు రిత్విక్‌కుమార్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారని, రాజ్‌కిరణ్ కెరీర్‌లో ఇప్పటిదాకా చేయని ఒక కొత్త తరహా పాత్రను ఇందులో చేస్తున్నారని, నిద్రలో నడిచే డిసీజ్ ఉన్న స్లీప్ వాకర్‌గా ఇందులో రాజ్‌తరుణ్ కనిపిస్తారని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: శబరి విగ్నేష్, సంగీతం: అనూప్ రూబెన్స్, నిర్మాణం: ఎస్‌కే గోల్డెన్ ఆర్ట్స్, ప్రశ్విత ఎంటర్‌టైన్మెంట్, ఎస్వీఎల్ క్రియేషన్స్.

## నమితలో ఇంత మార్పా..

దక్షిణాది సినీ పరిశ్రమలో ఒకప్పుడు తన అందం, గ్లామర్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక నమిత. తెలుగు, తమిళ భాషల్లో పలువురు స్టార్ హీరోల సరసన నటించి భారీగా అభిమానులను సంపాదించుకున్న ఆమె.. కెరీర్‌లో ఎన్నో విజయాలతో పాటు కొన్ని ఒడిదుడుకులను కూడా ఎదుర్కొన్నారు. తాజాగా తన కెరీర్ తొలినాళ్లలో తాను ఎలా ఉండేదో గుర్తుచేసుకుంటూ నమిత చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి.సినిమా ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో తనకు వరుస అవకాశాలు, విజయాలు రావడంతో తనలో తెలియకుండానే అహంకారం పెరిగిందని నమిత వెల్లడించారు. అప్పట్లో ఎవరి మాటా వినకుండా, తనకు నచ్చినట్లుగానే వ్యవహరించేదాన్నని ఆమె చెప్పుకొచ్చారు. తన ప్రవర్తన కారణంగా తోటి నటీనటులు, సాంకేతిక నిపుణులు, జూనియర్ ఆర్టిస్టులు కూడా ఇబ్బందులు ఎదుర్కొన్నారని నమిత గుర్తుచేసుకున్నారు. అదే సమయంలో ఇండస్ట్రీలోని కొందరు శ్రేయోభిలాషులు తనకు సరైన సలహా ఇచ్చారని తెలిపారు.ఇదే తరహా అహంకారంతో కొనసాగితే ఇండస్ట్రీలో ఎక్కువ కాలం ఉండలేవు అంటూ వారు తనను హెచ్చరించారని, ఆ మాటలు తనపై తీవ్ర ప్రభావం చూపాయని నమిత చెప్పారు. ఆ తర్వాత తన తప్పును గుర్తించి ప్రవర్తనలో మార్పు తెచ్చుకున్నానని వెల్లడించారు. కెరీర్‌లో కొన్ని తప్పుడు నిర్ణయాలు కూడా తీసుకున్నానని నమిత అంగీకరించారు. కొన్ని కథలను ఎంచుకోవడంలో చేసిన పొరపాట్ల వల్ల తన కెరీర్‌పై ప్రభావం పడిందని తెలిపారు. అయితే ఆ అనుభవాలను ప్రతికూలంగా చూడకుండా, వాటి నుంచి ఎన్నో జీవిత పాఠాలు నేర్చుకున్నానని చెప్పారు. గతంలో జరిగిన విషయాలను



తలుచుకుంటే తనలో చాలా మార్పు వచ్చిందని, ఇప్పుడు జీవితాన్ని మరింత పరిణతితో చూస్తున్నానని నమిత చెప్పినట్లు తెలుస్తోంది. ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. నమిత 1998లో 'మిస్ సూరత్'గా నిలిచారు. అనంతరం 2001లో 'మిస్ ఇండియా' పోటీల్లో రన్నరప్‌గా నిలిచి మోడలింగ్, గ్లామర్ రంగంలో గుర్తింపు తెచ్చుకున్నారు. దర్శకుడు శ్రీను వైట్ల తెరకెక్కించిన 'సొంతం' సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. ఆ తర్వాత 'ఒక రాజు ఒక రాణి', 'ఓ రాధ ఇద్దరు కృష్ణుల పెళ్లి' వంటి సినిమాల్లో నటించారు. ప్రభాస్‌తో కలిసి నటించిన 'బిల్లా'లో గ్లామరస్ పాత్రలో కనిపించి మరింత పాపులర్ అయ్యారు. బాలకృష్ణ నటించిన 'సింహా' చిత్రంలోనూ ప్రత్యేక పాత్రలో మెప్పించారు. మోహన్‌లాల్ సరసన నటించిన 'మన్యం పులి'తో మలయాళ ప్రేక్షకులకు కూడా చేరువయ్యారు.తమిళ చిత్ర పరిశ్రమలోనూ నమితకు భారీ క్రేజ్ లభించింది. ఒక దశలో ఆమెకు అభిమానులు ఏకంగా గుడి కట్టేంతగా ఆదరణ లభించడం అప్పట్లో సంచలనంగా మారింది.

## ఆస్కార్ నుంచి దీపికా పదుకొణెకు అరుదైన గుర్తింపు..



బాలీవుడ్ దర్శకుడు అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్, దీపికా పదుకొణె జంటగా నటించిన కల్ట్ హిట్ చిత్రం 'యే జవానీ హై దీవానీ' మరోసారి వార్తల్లో నిలిచింది. ఈ చిత్రంలో దీపికా పదుకొణె పోషించిన 'నైనా తల్వార్' పాత్రకు ఆస్కార్ అవార్డులను అందించే 'ది అకాడమీ' నుంచి ప్రత్యేక గుర్తింపు లభించింది. అకాడమీ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఈ సినిమాలోని ఒక ప్రత్యేకమైన దృశ్యాన్ని పంచుకుంటూ మీ కళ్ల ముందే ఉన్న అందాన్ని ఆస్వాదించమని నైనా మనకు ఇస్తున్న చిన్న గుర్తు అంటూ క్యాప్షన్ జోడించింది. ఉదయపూర్‌లో అదితి వివాహ వేడుకకు ముందు వచ్చే సూర్యాస్తమయ దృశ్యాన్ని అకాడమీ షేర్ చేసింది. ఈ సీన్‌లో ఎప్పుడూ లైఫ్‌లో పరిగెత్తే బన్నీతో (రణ్‌బీర్ కపూర్), క్షణాన్ని ఆస్వాదించాలని, ప్రతిదీ అనుభవించడం సాధ్యం కాదని, కొన్నిసార్లు ఉన్న చోటే సంతోషంగా గడపడం ముఖ్యమని నైనా వివరిస్తుంది. సినిమాలోని ఈ భావోద్వేగ సన్నివేశం ప్రేక్షకుల మనసులను ఎంతగానో హత్తుకుంది. ఈ పోస్ట్ చూసిన అభిమానులు సోషల్ మీడియాలో తమ ఆనందాన్ని పంచుకుంటున్నారు. "ఈ సినిమా నా హృదయంలో ఎప్పటికీ ప్రత్యేకమే," అని ఒక అభిమాని అనగా, మరొకరు "ఎన్ని సినిమాలు చూసినా, 'యే జవానీ హై దీవానీ' మాత్రం ఎప్పటికీ ప్రత్యేకమే. ఏడాదికిసారైనా ఈ సినిమా చూస్తాను, ఇది ఇంటికి వెళ్లిన అనుభూతిని ఇస్తుంది," అని పేర్కొన్నారు. 2013లో విడుదలైన ఈ చిత్రానికి రణ్‌బీర్, దీపికాలతో పాటు ఆదిత్య రాయ్ కపూర్, కల్కి కోచ్లిన్ నటన, ప్రీతమ్ సంగీతం అప్పట్లో సంచలనం సృష్టించాయి. ఇప్పటికీ ఈ సినిమాకు కోట్లాది మంది అభిమానులున్నారు.

Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098.
Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com